క్లుప్తంగా

తల్లిపాలు శ్రేయస్కరం


నగసింహపురంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జయశ్రీ

పాలసముద్రం: బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ తెలిపారు. గురువారం నరసింహపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడంతో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పుట్టిన గంటలోనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


కాలువలను శుభ్రం చేయిస్తున్న కార్యదర్శి

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో కార్యదర్శి వెంకటేశ్, సర్పంచ్ కుమారి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గురువారం పచ్చికాపల్లం ప్రధాన రహదారి పక్కన నిర్మించిన మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ రోడ్లు, వీధులపై, పక్కన చెత్తాచెదారాన్ని వేయకూడదన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ సహకరించాలని సూచించారు.

నాసిరకం ఇసుకతో రోడ్డు నిర్మాణం


నాసిరకం ఇసుక

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురంలో సిమెంట్ రోడ్డు పనులకు వంకలోని నాసిరకం ఇసుకలో రోడ్డు పనులు చేస్తున్నారని గురువారం గ్రామ ప్రజలు వాపోతున్నారు. సీసీ రోడ్లు వేయాలంటే గంగాధరనెల్లూరు రీచ్ నుంచి ఇసుక తీసుకొచ్చి అందులో రోడ్లు పనులు చేసేవారు. అయితే వనదుర్గాపురంలో కాంట్రాక్టర్ అలా చేయకుండా వర్షానికి వంకలో వచ్చిన నాసిరకం ఇసుకతో రోడ్డు పనులు చేస్తున్నాడు. గ్రామస్తులు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి ఉన్నతాధికారులు స్పందించి సిమెంట్ రోడ్ల పనులకు గంగాధరనెల్లూరు రీచ్ నుంచి తీసుకొచే ఇసుకను వాడాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

విజయపురం: తల్లిపాలు బిడ్డకు అమృతమని ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు అన్నారు. శ్రీహరిపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు తాగించాలని వాటిలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవం పోస్టర్‌ను విడదల చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, హెల్పర్ గంగోత్రి, ఆశ కార్యకర్త సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


శ్రీవేణుగోపాల స్వామి వాహన ఊరేగింపు

కార్వేటినగరం: తెప్పోత్సవ వేడుకలను పురస్కరించుకుని రెండో రోజు గురువారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారు పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన తదితర నిత్యకై ంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌ను పట్టువస్త్ర సుగంధభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చారు. పుర వీధుల్లో మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 6.30 గంటల నుంచి స్కంధపుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలుడు 7 చుట్లు విహరించారు. తెప్పోత్సవాన్ని తిలకించడానికి హాజరైన అశేష జనవాహినికి స్వామివారు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు శబరీష్, రమేష్, గోపాలాచారి, షరాబు బాబుసురేష్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో జీవాల సంరక్షణ



విజయపురం: గొర్రెల పెంపకంలో తగు జాగ్రత్తలు పాటిస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చని కళియంబాకం పశు వైద్యాధికారి శివమూర్తి సూచించారు. పలువురు సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ కూలీలు గొర్రెలను అధిక సంఖ్యలో పెంచుతున్నారని తెలిపారు. అయితే.. వీటి పోషణలో తగు జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రతి ఏడాది 10 శాతం వరకు గొర్రెల కోల్పోతున్నారన్నారు. దీంతో పలువురు గొర్రెల పెంపకందారులు లాభాల బదులు నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. గొర్రెల పోషణలో ఆధునిక యాజమాన్య పద్ధతులు, ఆరోగ్య రక్షణపై సరైన అవగాహన పెంచుకుని లాభాలు ఆర్జించాలని సూచిస్తున్నారు.

- గొర్రెల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి.
- ఆరోగ్య రక్షణపై అవగాహన అవసరం

పెంపకంలో జాగ్రత్తలు

- గొర్రెల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గాలి వెలుతురు వచ్చేలా వాటిని ఎత్తైన ప్రదేశాల్లో నిర్మించుకోవాలి. అలాగే తడీ లేకుండా చూసుకోవాలి.
- గొర్రెలకు అమ్మతల్లి, పీపీఆర్ వంటి రోగాల నివారణకు టీకాలు వేయించాలి.
- క్రమం తప్పకుండా 60 నుంచి 90 రోజులకోసారి నట్టల నివారణ మందులు తాగించాలి. ఈ మందులను పశువైద్యుల సలహా మేరకు అందించాలి.
- గొర్రెల పోషణలో సరైన జాగ్రత్తలు పాటించాలి. లేని పక్షంలో గొర్రెల పిల్లలు వందకు 20 వరకు మృతి చెందుతాయి. వీటిని అరికట్టాలి. గొర్రెల పిల్లలకు పుట్టిన మూడో రోజు జున్ను పాలు తాగించాలి. పశు వైద్యుల సలహా మేరకు రోగ నిరోధక మందులను నోటి ద్వారా అందించాలి.
- గొర్రెలకు పరిశుభ్రమైన నీటి ప్రవాహాల వద్దనే నీటిని తాపాలి.
- గొర్రెల మందలో విత్తనపు పొట్టేళ్లను ప్రతి రెండు సంవత్సరాలకోసారి మార్చుకోవాలి.
- మందలో వచ్చే వ్యాదులను అప్రమత్తంగా ఉంటూ గమనించాలి. అలాంటి వ్యాధి లక్షణాలు ఉన్న గొర్రెలను మంద నుంచి వేరు చేసి సరైన చికిత్స అందించాలి.
- దోమలు, ఈగలతో కొన్ని వ్యాదులు వచ్చే అవకాశం ఉంది. వీటి నివారణకు వర్షా కాలం, శీతా కాలంలో గొర్రెల మందలో వేపాకు పొగను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.
- వేసవి కాలంలో ఎండ వేడి ఎక్కువగా ఉంటుంది. జీవాలు వేడికి ఇబ్బంది పడ కుండా వాటిని నీడలో ఉంచేలా పాకలను ఏర్పాటు చేయాలి. జీవాలను ఎక్కువసేపు ఎండలో ఉంచితే రోగాలు వస్తాయి.
- జీవాలు వేసవిలో సరైన తిండి దొరక్క, క్రిమి సంహారక మందులు చల్లిన పొలాల్లో మేపకూడదు. గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తే గొర్రెల మరణాలు తగ్గించి, అధిక లాభాలు పొందవచ్చు.

> **ప్రతి ఏడాది వ్యాక్సిన్ వేసుకోవాలి**
> గొర్రెల పెంపకందారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ఏడాదిలో నాలుగు సార్లు నట్టల నివారణ మందు వేయించుకోవాలి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం మూడు సార్లు ఉచితంగా అందిస్తుంది. ఇది కాకుండా ఈటీ, పీపీఆర్ వ్యాక్సిన్ తప్పని సరిగా వేసుకోవాలి.
> – శివమూర్తి, పశు వైద్యాధికారి, కళియంబాకం

చిన్నారికి ఆశీర్వాదం


చిన్నారిని ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండలంలోని చిన్నతయ్యూరు గ్రామంలో నిర్వహించి ఎంపీపీ సరిత జనార్దన్ మనవడు నామకరణం వేడుకలకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారికి పలు బహుమతులును అందించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వైఎస్‌ఆ సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ అందరికీ అండగా ఉంటానని, ఎవరూ అక్రమ కేసులకు భయపడకండని అన్నారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ వరదమ్మ, మండల కన్వీనర్ మణి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాళప్ప, నియోజకవర్గం సాంస్కృతిక అధ్యక్షుడు మణి, నాయకులు మహేష్, బాబు, యోగానందం, వేంకటేష్, మోహన్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

11న సామాజిక తనిఖీ ప్రజావేదిక

నగరి: మండలంలోని 21 పంచాయతీల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే 18వ విడత సామాజిక తనిఖీకి సంబంధించిన ప్రజావేదిక ఈ నెల 11వ తేదీన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఎంపీడీఓ కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్యం, గృహనిర్మాణ, ఇతర శాఖల్లో చేపట్టిన పనులకు సంబంధించిన అంశాలపై తనిఖీలో కనుగొన్న అంశాలను గ్రామసభలో వెల్లడిస్తామన్నారు.

కానిస్టేబుల్‌పై దాడికి యత్నం

పుత్తూరు: బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్‌పై ఇద్దరు యువకులు దాడికి యత్నించడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచిన ఘటన గురువారం పుత్తూరులో చోటు చేసుకొంది. సీఐ శేఖర్‌రెడ్డి కథనం మేరకు.. బుధవారం సాయంత్రం గేట్ పుత్తూరులోని పిళ్లారిపట్టు రోడ్డులో కె.సాయి(29), లోకేష్(27)లు బహిరంగంగా మద్యం తాగుతుండగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శంకర్ వారిని అదుపులోకి తీసుకోవడానికి యత్నించాడు. దీంతో ఇద్దరు యువకులు కానిస్టేబుల్‌పై దాడికి యత్నించడమే కాకుండా చంపేస్తామంటూ బెదిరించారు. దీనిపై కానిస్టేబుల్ శంకర్ ఫిర్యాదు మేరకు సాయి, లోకేష్‌లను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిందిగా కోర్టు పోలీసులను ఆదేశించింది.

రేషన్ బియ్యం స్వాధీనం

పుత్తూరు: మండల పరిధిలోని కైలాసపురం గ్రామంలోని ఓ షెడ్‌లో నిల్వ ఉంచిన 40 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఓబయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జరిపిన దాడిలో అక్రమంగా నిల్వ చేసిన 1970 కేజీలు కలిగిన 40 బస్తాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. ఈ బియ్యం విలువ రూ.30 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. అరెస్టయిన నిందితుడు తమిళనాడు రాష్ట్రంలోని పళ్లిపట్టు తాలూకా పాండ్రేడు గ్రామానికి చెందిన కె.దయాళన్‌గా నిర్ధారించారు. నగరికి చెందిన చిన్ని అలియాస్ హేమప్రసాద్ అనే మరో నిందితుడు పరారైనట్లు తెలిపారు. రేషన్ బియ్యం స్వాధీనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చేనేత సంప్రదాయ సంపద


చేనేతపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నగరి: సంప్రదాయ సంపదకు ప్రతీక చేనేత రంగమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. యువతలో స్వదేశీ వస్త్రాలపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక క్లబ్ సమన్వయకర్త అరుణ కుమారి మాట్లాడుతూ భారతీయ చేతి మగ్గాల వెనుక ఉన్న కళ, నైపుణ్యం, సంప్రదాయాలను వివరించారు. యువత దేశీయ వస్త్రాలను ప్రోత్సహించాలని సూచించారు. ఎన్‌సీసీ కోఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ దేశభక్తి భావనలు కలిగించే కార్యక్రమాలలో చేనేత ఉత్పత్తుల ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ మహేశ్వరి, అధ్యాపకులు రామానుజులు, స్వాతి, శ్రీలక్ష్మీ, సుహాసిని, పంకజ, రేవతి, చినపాపమ్మ, రమేష్, ఉమామహేశ్వరి, మునికుమారి, లాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ నేత కార్మికుడిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నేతన్నలకు సన్మానం

చింతల పట్టెడలో బీజేపీ సీనియర్ నాయకుడు చిట్టిబాబు చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నేత వృత్తిలో విశేష కృషి చేసిన కుప్పుస్వామి, గణేషన్, ఏకాంబరం, రామన్, మణివన్నన్, పొన్నప్పన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో హరికృష్ణ, పొన్నప్పన్, మోహన్, రామన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతను విస్మరించారు

– మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి


కూటమి ప్రభుత్వం అరాచకాలను విమర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం

పాలసముద్రం: రాష్ట్రంలో చేనేతలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని మాజీ డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి తెలిపారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. 2014లో చేనేతలకు చంద్రబాబు ఇచ్చిన 25 హామీలను బుట్టదాఖలు చేశారని విమర్శించారు. 2024 మేనిఫెస్టోలో చేనేతలకు ఉచిత విద్యుత్, జీఎస్టీ ఫ్రీ హామీలిచ్చినా వాటిని అమలు చేయలేదన్నారు. ఆప్కోను నిర్వీర్యం చేసి, చేనేత వ్యవస్థను పాతాళానికి తొక్కారని, వారంతా మళ్లీ ఆత్మహత్యలు చేసు కునేలా ప్రేరేపిస్తున్నారని సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో జగనన్న ప్రతి చేనేత కుటుంబానికి రూ.24 వేలు చొప్పున ఐదేళ్లు వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా రూ 983 కోట్లు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. కరోనా కష్ట కాలంలోనూ ఈ మొత్తం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఆప్కో వస్త్రాలను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల ద్వారా పరిచయం చేసి చేనేతలను అగ్రగామిగా నిలిపారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చేనేలకు రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి శంకు స్థాపన చేశారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు మోసం చేయకుండా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేయకపోతే ప్రజల పక్షాన వైఎస్‌ఆర్ సీపీ ఎదుర్కొంటామని, పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సెల్‌ఫోన్లు మాకొద్దు

- యాప్‌లతో ముప్పతిప్పలు పెడుతున్నారు
- ఫోన్లను బాక్సులో వేసి సీడీపీఓ కార్యాలయంలో ఉంచిన అంగన్‌వాడీలు


ఫోన్‌లను బాక్సులో వేస్తున్న అంగన్‌వాడీలు

నగరి: పనిచేయని ఫోన్లు మాకొద్దు అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఫోన్లు మూటగట్టి సీడీపీఓకు అప్పగించారు. గురువారం సీడీపీఓ కార్యాలయానికి సీఐటీయూ నాయకురాలు ధనకోటి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మాకు సెల్ ఫోన్లు వద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదని, అయినా అధికారులు, ప్రభుత్వం రోజుకో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చిన్నపిల్లలు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందుకునే లబ్ధిదారుల వివరాలు పొందుపరచాలని వేధిస్తోందన్నారు. తమ కార్యకలాపాలను ఇక నుంచి రికార్డుల ద్వారా మాత్రమే ఇస్తామని, ఫోన్లలో ఇవ్వలేమన్నారు. పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య ఉండడంతో సమాచారం పొందుపరచడంలో తలలు పట్టుకుంటున్నామన్నారు. వేతనానికి తగ్గ పనులు మాత్రమే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్‌లు తీసకోవడానికి అధికారులు నిరాకరించడంతో వారిని ఒక బాక్స్‌లో వేసి కార్యాలయంలో పెట్టేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకగా హంస వాహన సేవ


సైంధవ రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ సమేత అర్జునస్వామి

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హంస వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 5 గంటలకు సైందవ రథోత్సవం, 6 గంటలకు తవణం పల్లకి ఉత్సవం నిర్వహించారు. రాత్రి 8గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో, ద్రౌపదీ సమేత అర్జున స్వాములను సర్వాంగ సుందరంగా అలంకరించి హంస వాహనంపై కొలువుదీర్చారు. బీసీరాజా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. రాత్రి 9 గంటలకు ఆర్.నాగమునిరెడ్డి ఆధ్వర్యంలో సింహ వాహనంపై స్వామి అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

నేడు అర్జున తపస్సు

శుక్రవారం ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు. 7 గంటలకు పట్టణంలోని ఈశ్వరాలయం నుంచి పార్వతీ పరమేశ్వర్లు నంది వాహనంపై ద్రౌపదీదేవి ఆలయానికి ఊరేగింపుగా విచ్చేయుట. అర్జునుడికి పాశుపతాస్త్రము నొసంగుట. ఉదయం 10 గంటలకు అర్జునుడు తపస్సుమాను అధిరోహించి భక్తులకు ప్రసాదం అందజేయడం జరుగుతుంది. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ సర్వభూపాల వాహన ఉత్సవం. సాయంత్రం 4 గంటలకు ఉత్తర గోగ్రహణము. రాత్రి 9 గంటలకు రైల్వేస్టేషన్ వద్ద బాణాసంచా వేడుక, పాటకచ్చేరి జరుగును.

వైభవంగా తెప్పోత్సవం


తెప్పపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

శ్రీరంగరాజపురం: శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కల్గిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల ప్రకారం మండలంలోని 49కొత్తపల్లి మిట్ట గ్రామంలో నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా ఉన్నాయని, మోస పూరితమైన కాల్స్‌తో అందరు జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత మద్యం, గంజాయి, సిగరెట్, గుట్కా తదితర అలవాట్లు చేసుకోకూడదన్నారు. పిల్లల అలవాట్లుపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఇటీవల కానిస్టేబుల్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన రేవతి, తిరుమలయ్యని సన్మానించారు. అనంతరం గ్రామాల్లో పోలీసులు పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, స్థానిక సర్పంచ్ ఢిల్లయ్య, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుల నిరసన


నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

పుత్తూరు: దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుపతి జిల్లా జీసీజీటీఏ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బదిలీలు, పదోన్నతులు తదితర న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సుజన, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.